## ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రజావాణిలో అందించే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ సమస్యలపై 332 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### జీహెచ్‌ఎంసీలో 132 దరఖాస్తులు

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు ఆరు జోన్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 132 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏసీ రెవెన్యూ, అడ్మిన్‌కు 4, సీఈ మెయింటనెన్స్ వెటర్నరీ, ఎల్‌ఏఓకు 3, శానిటేషన్, హెల్త్, యూబీడీసీఈ ప్రాజెక్టుకు-1 అర్జీలు చేసుకున్నారు. అలాగే ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 వచ్చాయి. మరికొన్ని విభాగాలకు దరఖాస్తులు అందజేశారు. కాగా, వీటితోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జడ్సీ, ఇతర అధికారులు

## జీహెచ్‌ఎంసీ ప్రజావాణికి 35 ఫిర్యాదులు

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 35 ఫిర్యాదులు అందాయి. టౌన్‌ప్లానింగ్ 22, ఇంజనీరింగ్ 6, అర్బన్ బయోడైవర్సిటీ 3, వెటర్నరీ 2, ఎలక్ట్రికల్ విభాగం-2 చొప్పున ఫిర్యాదులు అందుకున్న జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహన్ వెంటనే సంబంధిత విభాగాలకు బదిలీ చేశారు. ఆయా సర్కిళ్ల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జడ్సీ ఆదేశాలు జారీ చేశారు. గతంలో వచ్చిన ఫిర్యాదులే పదేపదే వస్తుండటంతో ఏం చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. ఆక్రమణలు తొలగించమని చెప్పినా, అక్రమ నిర్మాణాలను నిలువరించాలని విజ్ఞప్తి చేసినా లంచాలకు అలవాటు పడిన అధికారులు సిబ్బందిని పంపించి కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై దృష్టి పెట్టకుండా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించమని ఆదేశాలు జారీ చేయడం తప్ప ఫిర్యాదులు పదేపదే ఎందుకు వస్తున్నాయో వాటిపై దృష్టిసారించకపోవడంతో ఎక్కడి సమస్య అక్కడే ఉందని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న రాణాప్రతాప్

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** సేవ్ ఏ లైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ సంస్థ అధ్యక్షుడు సూరగాని రాణాప్రతాప్ సోమవారం కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లో పేద వృద్ధ దంపతులు, ఒంటరి మహిళలకు 5 కేజీల బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అరుణకుమారి, భోగరాజు అందించిన విరాళాలతో ఆకలితో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి నిత్యావసరాలు అందించామన్నారు.



రోడ్డుపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

**అల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగం గాయత్రీనగర్ కాలనీలో సోమవారం పర్యటించారు. అక్కడ తాగునీరు సరఫరా అయినప్పుడల్లా రోడ్డుపై నీరు పారుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు. ఎగువ ప్రాంతం అయిన పర్వత్‌నగర్ ఆరోగ్య కేంద్రం నుంచి గాయత్రీనగర్ కాలనీ పల్లపుగా ఉండటం, డ్రైనేజీ వ్యవస్థ లోపాల కారణంగా సమస్య నెలకొందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని స్థానికులు వాపోయారు. కార్పొరేటర్ సబీహ బేగం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా కృషి చేస్తామన్నారు. వర్షపు నీటికోసం ప్రత్యేక క్యాచ్‌పిట్ ఏర్పాటు చేసే దిశగా ప్రణాళిక రచిస్తామని సబీహ బేగం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, సంజీవ నేత, బాబా జాహెద్ షరీఫ్, జ్ఞానేశ్వర్, యోగిరాజ్ స్వామి, సాంబయ్య, బంగారు, రమణ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టొద్దు

● సైబర్ క్రైం డీసీపీ కవిత దార

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఎట్టిపరిస్థితుల్లోనూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెంట్ జోసఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్‌ను ప్రారంభించారు. డిజిటల్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ వేధింపులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి ఉదాహరణలు చూపుతూ వివరించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడంతోపాటు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఎం.కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమా సిక్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



'డిజిటల్ కేర్ హబ్' ప్రారంభంలో మాట్లాడుతున్న డీసీపీ కవిత

## ఆటో కార్మికుల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఆటోడ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న ఒక రోజు బంద్ కార్యక్రమం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ క్రాంతి ఆటో యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఆటో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఎంతోమంది ఆటో కార్మికులం నష్టపోతున్నామని, సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. దీనికి తోడు నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, హరినాథరావు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదుకు ఏర్పాట్లు

● నేటి నుంచి కంప్యూటర్లలో నిక్షిప్తం
● జంట సర్కిళ్ల పరిధిలో 350 మంది ఆపరేటర్లు

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే గతనెల 30వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో బుక్‌లెట్స్‌లో రాసుకున్న వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ఏర్పాట్లను సోమవారం పూర్తిచేశారు. ఎన్యూమరేటర్లు ఆయా ఇళ్లకు పోనివారు ఏమైనా ఉన్నారా అని మూసాపేట్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ ఆరాతీశారు. ఏమైనా పెండింగ్ ఉంటే తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించడంతో సోమవారం కూడా అక్కడక్కడ సర్వే చేశారు.



కూకట్‌పల్లి సర్కిల్ డాటా ఎంట్రీ కోసం హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట సొసైటీలో చేస్తున్న ఏర్పాట్లు

### జంట సర్కిళ్ల పరిధిలో..

కూకట్‌పల్లి సర్కిల్‌కు సంబంధించి హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట సొసైటీలో, మూసాపేట్ సర్కిల్‌కు సంబంధించి బాలాజీనగర్ డివిజన్ అంజనేయనగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ ఫంక్షన్ హాల్లో సమగ్ర కుటుంబ డేటా ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. మూసాపేట్‌కు 200, కూకట్‌పల్లికి 150 మంది వరకు కంప్యూటర్ ఆపరేటర్లు అవసరం అని గుర్తించి నివేదికను బల్దియా ప్రధాన కార్యాలయానికి పంపించారు. సోమవారం సాయంత్రం నాటికే రెండు సర్కిళ్ల పరిధిలో 130 మంది వరకు ఐడీ, పాస్ వర్డ్‌లు వచ్చాయి. మంగళవారం పనిచేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కిస్తూనే ప్రభుత్వం అనుమతి ఇస్తే రెండో దఫా పేరుతో మరొకసారి క్షేత్ర స్థాయిలో సర్వే చేసేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఎన్యూమరేటర్ల సహకారంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని వినియోగించుకోనున్నారు. 100 శాతం సర్వే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలకు సహకరించాలని మూసాపేట్ డీసీ వంశీకృష్ణ తెలిపారు.

### ఒక్కో దరఖాస్తు కోసం..

జంట సర్కిళ్ల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఒక్కో ఆపరేటర్ ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు 15-20 నిమిషాల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. తొలిరోజు కాస్త ఆలస్యం అయినా ఆపరేటర్లకు ఏమైనా అర్థం కాకుంటే వివరించేందుకు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులను నియమించాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డాటా ఎంట్రీ అంతా కాంట్రాక్టర్ చూసుకుంటారని జీహెచ్‌ఎంసీ ఉద్యోగి ఒకరు తెలిపారు.

సర్వేలో ఇచ్చిన అన్నీ వివరాలు నమోదు చేస్తున్నారా? లేదా అన్నది ఎప్పటికప్పుడు చెక్ చేయకపోతే ప్రయోజనం ఏమి ఉంటుంది. కనీసం జీహెచ్‌ఎంసీ వార్డుకు ఒక అధికారి అయినా నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పది పరీక్షల్లో 10 గ్రేడ్ సాధిస్తే లక్ష పారితోషికం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ఓల్డుబోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఉదయం ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్ సంస్థ ఆర్థిక సాయంతో సమకూర్చిన 8 కంప్యూటర్లను స్కూల్ హెచ్‌ఎం మల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే కంప్యూటర్లు ఇచ్చినట్లు చెప్పారు. 2024-25లో విద్యాసంవత్సరంలో పది తరగతి పరీక్షల్లో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కో విద్యార్థికి లక్ష రూపాయలు అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్న బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్స్ సంస్థ నిర్వాహకులు కృష్ణా పొడిశెట్టి, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఎజాజ్, జంగయ్య, మక్కల నర్సింగ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్ పాల్గొన్నారు.



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

### షాపులకు ఉచితంగా కరెంటు ఇవ్వాలి

**హైదర్‌నగర్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి):** ఇందిరా పార్కు వద్ద నాయీ బ్రాహ్మణుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మేడ్చల్ జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో సభ్యులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సెలూన్‌షాపులకు ఉచితంగా కరెంటు ఇస్తే ఈ ప్రభుత్వం బిల్లులు కట్టాలని ఇబ్బందులు పెడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ మీకు అండగా ఉంటుందని, సెలూన్ షాపులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# మూడో సారీ వాయిదా!

● జేఎన్‌టీయూలో గోల్డెన్ జూబ్లీ భవనానికి కలగని మోక్షం ● సీఎం రాకపోవడంతో నిలిచిపోయిన ప్రారంభోత్సవం

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూలో రూ.50 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవన ప్రారంభోత్సవం మరోమారు వాయిదా పడింది. ఈ కార్యక్రమం వాయిదా పడడం మూడోసారి కావడం గమనార్హం. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగానైనా గోల్డెన్ జూబ్లీ భవనానికి మోక్షం కలుగుతుందేమోనని వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు భావించారు. గత వారంలో వర్సిటీ డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీనే భవనం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పడంతో అధికారులు సైతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత వారం రోజుల పాటు అవిశ్రాంతంగా శ్రమించి భవనం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. బాచుపల్లిలో తెలుగు యూనివర్సిటీ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు సోమవారం ఉదయం 10.30 గంటలకు సీఎం వస్తున్నారని, పనిలోపనిగా జేఎన్‌టీయూలో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని కూడా ప్రారంభిస్తారని వర్సిటీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూశాయి. తీరా మధ్యాహ్నం వరకు తెలుగు యూనివర్సిటీ కార్యక్రమానికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రాకపోవడంతో జేఎన్‌టీయూలో భవన ప్రారంభోత్సవం కూడా లేనట్లేనని వర్సిటీ ఉన్నతాధికారులు కబురు అందింది. దీంతో అప్పటివరకు భవనం వద్ద వేచిఉన్న విద్యార్థులు ఉద్యోగులు, అధికారులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులవడంతో ప్రస్తుతం జేఎన్‌టీయూకు పెద్ద దిక్కు లేక పోయింది. యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీని లేదా రెగ్యులర్ వీసీని ప్రభుత్వం నియమించేవరకు భవన ప్రారంభోత్సవం ఉండే అవకాశమే లేదని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జేఎన్‌టీయూకు ఆరు నెలలుగా వైస్ చాన్సలర్‌ను ప్రభుత్వం నియమించ లేకపోవడంపై అటు విద్యార్థి సంఘాల నుంచి ఇటు అధ్యాపక సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. జేఎన్‌టీయూకు వైస్ చాన్సలర్‌ను వెంటనే నియమించాలని ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని గోల్డెన్ జూబ్లీ భవనం

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టండి

● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత

**బాలానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా త్వరలో నిర్వహించబోతున్న ప్రజాపాలన విజయోత్సవాల వేడుకల విషయమై సోమవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండిరమేష్ టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితర సీనియర్ నేతలు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల పాలయిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బీ బ్లాక్ అత్యక్షుడు తూము వేణు, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొండకింది పుష్పారెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, శేరి సతీష్‌రెడ్డి, గోపిశెట్టి రఘు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతతో కాంగ్రెస్ నాయకులు

## వర్షపు నీటి కాలువ పనుల పరిశీలన



కాలువల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

**బాలానగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** బాలానగర్ డివిజన్ వినాయకనగర్‌లో కొనసాగుతున్న వర్షపు నీటి కాలువల నిర్మాణం పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీటి కాలువల నిర్మాణం పూర్తయితే దశాబ్దాలకాలం నుంచి వర్షపు నీటితో సతమత మౌతున్న రాజూకాలనీ, సాయినగర్, వినాయకనగర్ బస్తీవాసుల సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏఈ సునిల్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రాములు, స్థానిక నాయకులు ఎన్వి రత్నం, ఎర్రం చంద్రశేఖర్‌గుప్త, నర్ర విజయేందర్ రెడ్డి, గౌతమ్, గ్రీష్మంత్‌రెడ్డి, సోఫీ పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** మూసాపేట్, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పీవో ఇంద్రసేన ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించిన దివ్యాంగులందరూ ఉదయం 10 గంటలకు కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, శేరిలింగంపల్లి నియోజర్గ పరిధిలోని హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లిలో కొంత భాగం మధ్యాహ్నం 12 గంటలకు హెచ్‌ఎంటీహిల్స్ కమ్యూనిటీ హాల్లో జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు.

### స్టడీ సెంటర్‌కు స్థలం కేటాయించాలి

● మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** అంబేద్కర్ ఎడ్యుకేషనల్ స్టడీ సర్కిల్‌కు లైబ్రరీ, ఆడిటోరియం కోసం కొంపల్లి మున్సిపాలిటీలోని అపర్ణ ఫామ్ గ్రోలో 500 గజాల స్థలాన్ని కేటాయించాలని మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్, సన్న శ్రీనివాస్, రాంప్రసాద్‌లు సోమవారం కోరారు. ఈ సందర్భంగా వారు మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కొంపల్లి మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతంలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మున్సిపాలిటీలో స్థలాన్ని కేటాయిస్తే వారి భవిష్యత్‌కు బాగుంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.41, వంకాయ రూ.28, బెండకాయ రూ.35, పచ్చి మిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.38, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.26, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.47, గోబి పువ్వు రూ.40, దొండకాయ రూ.34, చిక్కుడు కాయ రూ.48, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.47, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.40, కీర రూ.22, దోసకాయ రూ.24, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.25, కంద రూ.60, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.50, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.40-50, మునగ కాయలు రూ.20-24, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.60, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.40, పల్లికాయ రూ.65, లోబా రూ.35, ఆ కాకరకాయ రూ.75. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



అండర్‌పాస్‌లో నిలిచిన నీళ్లను దాటేందుకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

## ఇరుకైన అండర్ పాస్‌తో ఇబ్బందులు

**అల్లాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరి సీతయ్య నగర్, రాధా కృష్ణ సొసైటీల నుంచి రాజీవ్ గాంధీనగర్, మూసాపేట్ గూడ్స్‌షెడ్ వైపు వెళ్లాలంటే ఉన్న ఏకైక మార్గం అక్కడి రైల్వే ట్రాక్ కింద నిర్మించిన అండర్ పాస్. నిత్యం ఈ అండర్ పాస్ నుంచే వందలాదిగా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. అండర్ పాస్‌లో కొన్ని రోజులుగా నీరు చేరుతుండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. స్థానికులకు గత్యంతరం లేక ఇదే రోడ్డున రాక పోకలు సాగిస్తూంటారు. ఇలాంటి అండర్ పాస్ మరొకటి ఉంటే కష్టాలు తీరుతాయంటూ స్థానికులు వాపోతున్నారు. సోమవారం అండర్ పాస్‌లో మోకాలులోతు నీరు నిలువటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులెదురయ్యాయి. రైల్వే ట్రాక్ కిందగా యూసుఫ్‌నగర్ నుంచి గాయత్రీనగర్ వరకూ అండర్‌పాస్ ప్రతిపాదన గతంలో ఉన్నా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇకనైనా అధికారులు అండర్‌పాస్‌పై శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన ఏకాంత్‌గౌడ్

## పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

**హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** వివేకానందనగర్ వెంకటేశ్వర్ నగర్‌లోని ఇల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన ఏకాంత్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వంటశాలను, బాత్‌రూంలను, పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణేష్ గౌడ్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి జితేందర్, సెక్రటరి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



9ఎం ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్

## 9ఎం ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

**హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** కేపీహెచ్‌బీలో అకుంర హాస్పటల్ 9ఎం ఫెర్టిలిటీ నూతన సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను సోమవారం 9ఎం ఫెర్టిలిటీ, అంకుర హాస్పటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుర హాస్పటల్ ప్రయాణం కేపీహెచ్‌బీ నుంచి మొదటి ప్రయాణం ప్రారంభమైందని, ఇక్కడ ఉన్న పిల్లలు, మహిళలకు ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణ సేవలతో మద్దతు ఇవ్వడం చాలా సంతృప్తికరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** సులువుగా డబ్బు సంపాదించేందుకు ఏపీలో కొనుగోలు చేసి కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 1న సాయంత్రం 6.30 గంటల సమయంలో జయానగర్‌లోని విల్సమ్ క్రికెట్ అకాడమీ దగ్గర కోసూరి తులసీరామరాజు గంజాయి అమ్మేందుకు ఉండటంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. గత నెల 26న ఏపీలోని అరకులో 1.4కిలోల గంజాయిని రూ.8 వేలకు కొనుగోలు చేసి అధిక ధరకు అమ్మేందుకు ఇక్కడకు వచ్చినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చిన మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నామని సీఐ ముత్తు తెలిపారు.



పాపమ్మకాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

## కాలనీకి ముఖద్వారం చిరునామా : ఎమ్మెల్యే గాంధీ

**హైదర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ పాపమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖద్వారాన్ని సోమవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ముఖద్వారం కాలనీకి చిరునామాకు సంకేతంగా ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానికంగా ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, గణేష్, శ్రీనివాస్, కాశినాథ్‌యాదవ్, షౌకత్‌అలీమున్నా, మల్లేష్‌నాగరాజు, ఖలీమ్, గణేషన్, కాలనీ వాసులు పాపమ్మ, రాంచందర్, వేలు, రాము, కృష్ణ, త్రినాథ్, వెంకటరావు, మాధవరావు, శ్రీను, కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ఆర్థికసాయం అందజేస్తున్న కొండా విజయ్, క్లబ్ ప్రతినిధులు

## దివ్యాంగుడి వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

**చందానగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** ప్రత్యేక అవసరాలు ఉన్న వారికి చేయూతనిస్తే వారు భవిష్యత్తులో రాణిస్తారని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ అన్నారు. కృష్ణ అనే దివ్యాంగుడికి ఆరోగ్య చికిత్స నిమిత్తం రూ.10వేల నగదును సోమవారం చందానగర్‌లోని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న వారికి మానవత దృక్పదంతో దాతలు చేయూత అందించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, మారం ప్రసాద్ తదితరులు ఉన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, పాస్టర్లు

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**హైదర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడ పరిధిలోని ఫుల్‌గాస్పల్ చర్చ్‌లో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఇస్రాయిల్, సత్యరాజు, రాజు, నాగభూషణం, దేవదాస్, శ్యాముల్, రాంబాబు, విల్సన్‌బాబు పాల్గొన్నారు.



విద్యార్థులతో డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు త్రివేణి విద్యార్థుల ఎంపిక

**మియాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** జిల్లా స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మదీనూడ, లింగంపల్లి త్రివేణి స్కూళ్ల విద్యార్థులు తయారు చేసిన 12 ప్రాజెక్టుతో పాల్గొన్నారు. ఈ పోటీకి రంగారెడ్డి జిల్లా నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పోటీలో పాల్గొన్నారు. పోటీల్లో త్రివేణి పాఠశాల మదీనగూడ బ్రాంచ్ విద్యార్థులు సీనియర్ విభాగంలో ప్రదర్శించిన రెండు ప్రాజెక్టులకు జిల్లాస్థాయి మొదటి బహుమతి, జూనియర్ విభాగంలో జిల్లా ఫస్ట్, సెకెండ్ బహుమతులు లభించినట్లు పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సీఆర్‌ఓ సాయినరసింహారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, జగదీష్‌బాబు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపీ శివధర్‌రెడ్డి

## సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

● డీజీపీ శివధర్‌రెడ్డి

**రాయదుర్గం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు సేవా దృక్పథంతో ముందుకు సాగితే పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషించవచ్చని ఇంటలిజెన్స్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావరిక్స్, రోజ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలంబన కార్యక్రమం మొదటి వార్షికోత్సవంలో ఆయన రాష్ట్ర ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్ కమిషనర్ కె.శశాంక్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను వారి కుటుంబాల వద్దే ఉంచి నాణ్యమైన విద్య అందించడం, పౌష్టికాహారం ప్రోత్సహించడం అనేది అభినందనీయమన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, లోకనాథ్, అజయ్, విజయ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రజావాణిలో అందించే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ సమస్యలపై 332 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### జీహెచ్‌ఎంసీలో 132 దరఖాస్తులు

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు ఆరు జోన్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 132 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏసీ రెవెన్యూ, అడ్మిన్‌కు 4, సీఈ మెయింటనెన్స్, వెటర్నరీ, ఎల్‌ఏఓకు 3, శానిటేషన్, హెల్త్, యూబీడీసీఈ ప్రాజెక్టుకు-1 అర్జీలు చేసుకున్నారు. అలాగే ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 వచ్చాయి. మరికొన్ని విభాగాలకు దరఖాస్తులు అందజేశారు. కాగా, వీటితోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# పట్టణ ఆరోగ్యకేంద్రంలో యంత్రాలు ఉన్నా.. టెక్నీషియన్లు లేరు

● నిలిచిన స్కానింగ్ సేవలు
● రోగులకు భారంగా మారిన వైద్య పరీక్షల ఖర్చులు

**గచ్చిబౌలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు రోగులకు అందడం లేదు. దీంతో మండలంలోని రోగులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండున్నర ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషిన్‌ను కేటాయించి.. హడావిడిగా ప్రారంభించారు. దీని ప్రారంభానికి చూపిన ఉత్సాహం, మిషన్‌ను ఆపరేట్ చేసే టెక్నీషియన్‌ను నియమించడంలో చూపించలేదు. టెక్నీషియన్‌ను నియమించకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అత్యధిక ప్రసవాలు జరిగే కేంద్రంగా శేరిలింగంపల్లికి పేరుంది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పది బస్తీదవాఖానాలు ఉన్నాయి. వివిధ వైద్య పరీక్షల చేయించుకునేందుకు బస్తీ దవాఖానాల నుంచి శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. ఇక్కడ అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ఆపరేట్ చేసేందుకు టెక్నీషియన్ లేకపోవడంతో పేద మహిళలు డబ్బులు వెచ్చించి బయట స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. ఇది వారికి ఆర్థిక భారంగా మారింది. నిత్యం రోగులతో కిటకిటలాడే ఆరోగ్యకేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ అందుబాటులో లేకపోవడం స్థానికులను ఇబ్బందుల పాలు చేస్తుంది. కొంతమంది రోగులు, స్థానికులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే శేరిలింగంపల్లి ఆరోగ్యకేంద్రానికి ప్రత్యేకత ఉందని, అలాంటి కేంద్రంలో స్కానింగ్ సేవలు అందకపోవడం పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.





ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్

శేరిలింగంపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రం

### స్కానింగ్ అగచాట్లు...

లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేకపోవడంతో గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యులు ఈ స్కానింగ్ పరీక్షల కోసం రోగులను బయటకు పంపిస్తున్నారు. ఒకసారి స్కానింగ్ చేయించుకోవాలంటే రూ.2500 నుంచి 4వేల వరకు ఖర్చు అవుతుందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఏ లక్ష్యం కోసమైతే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటు చేసిందో ఆ లక్ష్యం నేరవేరడం లేదు. స్కానింగ్ మిషన్‌ను ప్రారంభించడంలో చూపిన చొరవ టెక్నీషియన్ నియమించడంలో చూపకపోవడం స్థానికులను, ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

### అల్ట్రాసౌండ్ స్కానింగ్ తప్ప అన్ని సేవలూ అందుతున్నాయి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎక్స్‌రే, ఈసీజీతో పాటు ఇతర్రా 54 రకాల పరీక్షలు చేయడానికి లక్షాది రూపాయలు వెచ్చించి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. రేడియాలజీ విభాగంలో ఈసీజీ, ఎక్స్ రే సేవలు అందుతున్నాయి. మహిళలకు వారి అవసరాన్ని బట్టి రెండునుంచి మూడు, నాలుగుసార్లు స్కానింగ్ చేయాల్సి వస్తుంది. ఈ సేవలు కేంద్రంలో లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని లింగంపల్లి ఆరోగ్యకేంద్రానికి స్కానింగ్ మిషన్‌కు టెక్నీషియన్ నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

### టెక్నీషియన్‌ను నియమించాలి

అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసిన అధికారులు సిబ్బందిని నియమించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వందలాదిమంది రోగులు వస్తుంటారు. ముఖ్యంగా గర్భిణీలు ఎక్కువ వస్తుంటారు. వారికి స్కానింగ్ సేవలు అందడం లేదు. వెంటనే అధికారులు స్పందించి టెక్నీషియన్‌ను నియమించాలి.

- తాడిబోయిన రామస్వామియాదవ్, సామాజికవేత్త

# పది పరీక్షల్లో 10 గ్రేడ్ సాధిస్తే లక్ష పారితోషికం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ఓల్డుబోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఉదయం ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్ సంస్థ ఆర్థిక సాయంతో సమకూర్చిన 8 కంప్యూటర్లను స్కూల్ హెచ్‌ఎం మల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే కంప్యూటర్లు ఇచ్చినట్లు చెప్పారు. 2024-25లో విద్యాసంవత్సరంలో పది తరగతి పరీక్షల్లో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కో విద్యార్థికి లక్ష రూపాయలు అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్న బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, సిర్రస్ ల్యాబ్స్ సంస్థ నిర్వాహకులు కృష్ణా పొడిశెట్టి, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఎజాజ్, జంగయ్య, మక్కల నర్సింగ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్ పాల్గొన్నారు.



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

### షాపులకు ఉచితంగా కరెంటు ఇవ్వాలి

**హైదర్‌నగర్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి):** ఇందిరా పార్కు వద్ద నాయీ బ్రాహ్మణుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మేడ్చల్ జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో సభ్యులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ సెలూన్‌షాపులకు ఉచితంగా కరెంటు ఇస్తే ఈ ప్రభుత్వం బిల్లులు కట్టాలని ఇబ్బందులు పెడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మీకు అండగా ఉంటుందని, సెలూన్ షాపులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# మూడో సారీ వాయిదా!

● జేఎన్‌టీయూలో గోల్డెన్ జూబ్లీ భవనానికి కలగని మోక్షం ● సీఎం రాకపోవడంతో నిలిచిపోయిన ప్రారంభోత్సవం

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూలో రూ.50 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవన ప్రారంభోత్సవం మరోమారు వాయిదా పడింది. ఈ కార్యక్రమం వాయిదా పడడం మూడోసారి కావడం గమనార్హం. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగానైనా గోల్డెన్ జూబ్లీ భవనానికి మోక్షం కలుగుతుందేమోనని వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు భావించారు. గత వారంలో వర్సిటీ డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీనే భవనం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పడంతో అధికారులు సైతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత వారం రోజుల పాటు అవిశ్రాంతంగా శ్రమించి భవనం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. బాచుపల్లిలో తెలుగు యూనివర్సిటీ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించేందుకు సోమవారం ఉదయం 10.30 గంటలకు సీఎం వస్తున్నారని, పనిలోపనిగా జేఎన్‌టీయూలో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని కూడా ప్రారంభిస్తారని వర్సిటీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూశాయి. తీరా మధ్యాహ్నం వరకు తెలుగు యూనివర్సిటీ కార్యక్రమానికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రాకపోవడంతో జేఎన్‌టీయూలో భవన ప్రారంభోత్సవం కూడా లేనట్లేనని వర్సిటీ ఉన్నతాధికారులు కబురు అందింది. దీంతో అప్పటివరకు భవనం వద్ద వేచిఉన్న విద్యార్థులు ఉద్యోగులు, అధికారులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులవడంతో ప్రస్తుతం జేఎన్‌టీయూకు పెద్ద దిక్కు లేక పోయింది. యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీని లేదా రెగ్యులర్ వీసీని ప్రభుత్వం నియమించేవరకు భవన ప్రారంభోత్సవం ఉండే అవకాశమే లేదని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జేఎన్‌టీయూకు ఆరు నెలలుగా వైస్ చాన్స్‌లర్‌ను ప్రభుత్వం నియమించ లేకపోవడంపై అటు విద్యార్థి సంఘాల నుంచి ఇటు అధ్యాపక సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. జేఎన్‌టీయూకు వైస్ చాన్స్‌లర్‌ను వెంటనే నియమించాలని ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని గోల్డెన్ జూబ్లీ భవనం

# బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టండి

● ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత

**బాలానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా త్వరలో నిర్వహించబోతున్న ప్రజాపాలన విజయోత్సవాల వేడుకల విషయమై సోమవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండిరమేష్ టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం తదితర సీనియర్ నేతలు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల పాలయిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొండకింది పుష్పారెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, శేరి సతీష్‌రెడ్డి, గోపిశెట్టి రఘు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతతో కాంగ్రెస్ నాయకులు

## స్టడీ సెంటర్‌కు స్థలం కేటాయించాలి

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** అంబేద్కర్ ఎడ్యుకేషనల్ స్టడీ సర్కిల్‌కు లైబ్రరీ, ఆడిటోరియం కోసం కొంపల్లి మున్సిపాలిటీలోని అపర్ణ ఫామ్ గ్రోలో 500 గజాల స్థలాన్ని కేటాయించాలని మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్, సన్న శ్రీనివాస్, రాంప్రసాద్‌లు సోమవారం కోరారు. ఈ సందర్భంగా వారు మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కొంపల్లి మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతంలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మున్సిపాలిటీలో స్థలాన్ని కేటాయిస్తే వారి భవిష్యత్‌కు బాగుంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఆటో కార్మికుల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఆటోడ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న ఒక రోజు బంద్ కార్యక్రమం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐడీపీఎల్ క్రాంతి ఆటో యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఆటో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఎంతోమంది ఆటో కార్మికులం నష్టపోతున్నామని, సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. దీనికి తోడు నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, హరినాధరావు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ

**గచ్చిబౌలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):** కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో సోమవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలాధారణ భక్తులు ఆలపించిన గీతాలు, అయ్యప్ప నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, గౌతంగౌడ్, నర్సింహ, గణపతి, భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





అగ్ని ప్రమాదానికి కాలి బూడిదైన ఫర్నిచర్

## ఫర్నిచర్ వర్క్‌షాపులో అగ్నిప్రమాదం
## కాలిబూడిదైన ముడి సరుకు

**చందానగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పదంగా ఓ ఫర్నిచర్ వర్క్‌షాపు అగ్నికి దగ్ధమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తా వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి గుల్‌మొహర్‌కాలనీ సమీపంలో మహవీర్ సోఫా వర్క్‌షాపు ఉంది. దీనిని జగదీష్ పాటిల్ నిర్వహిస్తున్నాడు. నవంబరు 30న రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఈనెల 1న షాపు తెరవలేదు. ఆదివారం రాత్రి ఫర్నిచర్ వర్క్‌షాపు నుంచి మంటలు రావడంతో ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేసే సిబ్బంది, స్థానికులు జగదీశ్‌కు ఫోన్ చేశారు. అతను వెళ్లి చూసే సరికి అప్పటికే ఫర్నిచర్, ముడిసరుకు కాలిపోయింది. సుమారుగా రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగిందని జగదీశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలయని వ్యక్తులు వర్క్‌షాపు వెనకాల కిటికీలు తీసి నిప్పంటిచి పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టొద్దు

● సైబర్ క్రైం డీసీపీ కవిత దార

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** ఎట్టిపరిస్థితుల్లోనూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెంట్ జోసఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్‌ను ప్రారంభించారు. డిజిటల్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ వేధింపులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి ఉదాహరణలు చూపుతూ వివరించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడంతోపాటు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఎం.కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమా సిక్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



'డిజిటల్ కేర్ హబ్' ప్రారంభంలో మాట్లాడుతున్న డీసీపీ కవిత

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):** సులువుగా డబ్బు సంపాదించేందుకు ఏపీలో కొనుగోలు చేసి కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 1న సాయంత్రం 6.30 గంటల సమయంలో జయానగర్‌లోని విల్సమ్ క్రికెట్ అకాడమీ దగ్గర కోసూరి తులసీరామరాజు గంజాయి అమ్మేందుకు ఉండటంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. గత నెల 26న ఏపీలోని అరకులో 1.4కిలోల గంజాయిని రూ.8 వేలకు కొనుగోలు చేసి అధిక ధరకు అమ్మేందుకు ఇక్కడకు వచ్చినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. గంజాయి కొనుగోలు చేయడానికి వచ్చిన మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నామని సీఐ ముత్తు తెలిపారు.

# కాలనీలకు కలగా బస్సు సౌకర్యం

- ఆటోలను ఆశ్రయిస్తున్న పలువురు
- రోడ్డు వేశాక ఆగిన బస్సు సర్వీసులు
- సంవత్సరం కావస్తున్నా అందుబాటు లోకి రాని వైనం

కుత్బుల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలగానే మిగిలిపోయింది. వెరసి పదుల సంఖ్యలో ఉన్న కాలనీలు, బస్తీల ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని శ్రీరాంనగర్, ప్రసూననగర్, సంజీవయ్యనగర్, బాల్‌రెడ్డినగర్, పద్మానగర్, ఎన్టీఆర్‌నగర్‌తో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో దిల్‌కుష్‌నగర్‌కు జీడిమెట్ల, సికింద్రాబాద్, కోటి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉండేది. అయితే చింతల్ నుంచి కాకతీయనగర్, ప్రసూనగర్‌లలో ప్రధాన రహదారి వేశారు. అదేవిధంగా కాకతీయనగర్ కూరగాయల మార్కెట్ వద్ద వంతెనను నిర్మించారు.

రోడ్డును వేస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు సర్వీసును పూర్తిగా నిలిపివేశారు. పనులు పూర్తయి సంవత్సరం కావస్తున్నప్పటికీ బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించలేదు. ఈ ప్రాంతాల్లో జీడిమెట్ల పారిశ్రామికవాడలో పని చేసేవారు అధికంగా నివాసముంటారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాలలో వెళ్లేందుకే అధికంగా వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్టీసీ బస్సుల సర్వీసులను పునఃప్రారంభించాలని కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.


ఈ రోడ్డు వేస్తున్న సమయంలోనే బస్సు సర్వీసును నిలిపివేశారు


చింతల్ నుంచి లోపలి వైపు వెళ్లే రోడ్డు

**పార్కింగ్‌లతోనే సమస్య...**

ఇదిలా ఉండగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డును వెడల్పు చేయించారు. అయితే ఈ రోడ్డులో వ్యాపార సముదాయాల దగ్గర వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు వచ్చేందుకు వీలుపడటం లేదని అధికారులు తెలుపుతున్నట్లు సమాచారం.

**ఇబ్బందిగా ఉంది**



దుండిగల్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాను. మా ఇంటి వద్ద నుంచి చింతల్ వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. అదే ఆర్టీసీ బస్సులో అయితే కొంత ఖర్చు తగ్గుతుంది. బస్సు సౌకర్యం కల్పించాలి.

\- నీరజ్‌కుమార్, విద్యార్థి

**బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం**

ఈ విషయంపై జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులును వివరణ కోరగా.. గతంలో సిటీలో 9 వేల వరకు బస్సులుండేవి. ఇప్పుడు 6 వేలున్నాయి. అదే సమయంలో కరోనా సమయంలో కొన్ని సర్వీసులను నిలిపివేశాం. ఎవరైనా ఒక దరఖాస్తు చేసుకుంటే మా కమిటీ సంబంధిత కాలనీలలో పర్యటించి పరిశీలిస్తాం. బస్సు తిరిగేందుకు రోడ్లు అనువుగా ఉంటే సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

\- ఆంజనేయులు, డిపో మేనేజర్, జీడిమెట్ల

## ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టవద్దు

- సైబర్ క్రైం డీసీపీ కవిత దార


'డిజిటల్ కేర్ హబ్'లో మాట్లాడుతున్న డీసీపీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెంట్ జోసఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్‌ను ప్రారంభించారు. డిజిటల్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ వేధింపులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి ఉదాహరణలు చూపుతూ వివరించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడంతోపాటు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఎం.కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమా సిక్రీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభించిన కొలన్ హన్మంత్‌రెడ్డి

## ప్రజా పాలనలోనే బస్సు సౌకర్యం : కొలన్

నిజాంపేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రాజీవ్‌గృహకల్పకు, కాంగ్రెస్ ప్రజాపాలనలోనే బస్సు సౌకర్యాన్ని కల్పించామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బస్సు సౌకర్యం కల్పించడంతో స్థానికులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అక్కడి స్థానికులను కాంగ్రెస్ పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మైనార్టీఅధ్యక్షులు అంజద్, లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

**మరో కార్యక్రమంలో**

నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1 లక్షా 26 వేల 132 రూపాయలను బాధిత కుటుంబాలకు హన్మంత్‌రెడ్డి అందజేశారు.


సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాన్ని బాధితులకు అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

## సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగానికి రెండు, ఇంజనీరింగ్ శాఖకు అయిదు, విద్యుత్ శాఖకు ఒకటి, ఇంటి పన్నుల గురించి ఒక దరఖాస్తు వచ్చినట్లు డీసీ నర్సింహ తెలిపారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో పట్టణ ప్రణాళికా విభాగానికి రెండు, ఇంజనీరింగ్‌కు ఆరు, విద్యుత్ శాఖకు ఒక దరఖాస్తు వచ్చిందని డీసీ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సీఐ విజయవర్ధన్ తదితరులు

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన సీఐ

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని ఫైన్ క్యాబ్ క్రికెట్ గ్రౌండ్‌లో గురునానక్ హైస్కూల్, దీక్షిత్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే క్రికెట్ పోటీలను పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు రెండు జట్లు పాల్గొన్నాయి. గెలిచిన జట్టుకు గిరిజా శంకర్ దీక్షిత్ కప్‌ను అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె.ప్రవీణ్‌కుమార్, అకాడమీ సభ్యులు, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

## సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

షాపూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం షాపూర్‌నగర్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పార్టీ మండల కమిటీ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ పేద ప్రజలు, కార్మికులు, అసంఘటిత రంగాల తరపున పోరాటం చేస్తున్న సీపీఎం జిల్లా మహాసభలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా చూడాలని పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించామన్నారు. జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, దేవదానం, సత్యం, డి. కరుణాకర్, ఎండి. జాకీర్‌హుస్సేన్, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న డా.ప్రశాంత్‌కుమార్

## లైఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నిజాంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రతినగర్‌లోని లైఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు అవార్డు దక్కింది. ఇటీవల బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఎంఐఏ) బంజారాహిల్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ వైద్య రంగంతో పాటు సామాజిక సేవారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్తూరు ఎంపీ ప్రసాద్‌రావుల పురస్కారాన్ని అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం శాఖ ఫౌండర్ ప్రెసిడెంట్ డా.ప్రభుకుమార్, ప్రతినిధులు, అవార్డు గ్రహీతలు, ఐఎంఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గొలుసు చోరి చేసిన నిందితుల అరెస్ట్

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు చెందిన పృథ్విరాజ్, ఉమామహేశ్వరరావులు గత నెల 29వ తేదీన రాత్రి 11 గంటల ప్రాంతంలో వెన్నెలగడ్డ హనుమాన్ దేవాలయం సమీపంలో మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన చింతల్‌కు చెందిన బొల్లారం సాయికుమార్, ఏనుగుల భరద్వాజ్, సుచిత్రకు చెందిన చింతల ధనుష్, కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన శివం సుంకల అలియాస్ సన్నీ, భాగ్యలక్ష్మికాలనీకి చెందిన సుంకాల హరీశ్ వర్ధన్ అలియాస్ కిరణ్‌లు వారితో గొడవపడ్డారు. పృథ్విరాజ్ మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని వారు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం పై ఐదుగురిని రిమాండ్‌కు తరలించామని ఏసీపీ రాములు తెలిపారు. ఇందులో మైనర్‌కు నోటీసులు అందజేశారు.

## హత్య కేసును చేధించిన పోలీసులు

పేట్ బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ మాణిక్యనగర్‌కు చెందిన బత్తుల సంగీత(24) భర్త జైపాల్ 2019లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. తదనంతరం ఆమె తనతో పాటే పనిచేసే మార్క్‌ను వివాహం చేసుకుంది. అయితే సంగీత ప్రవర్తనలో మార్పు గమనించి, అనుమానంతో మార్క్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గత నెల 21న తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే కిచెన్‌లో ఇద్దరూ గొడవ పడుతుండగా హాల్‌లో ఉన్న సంగీత తల్లి లక్ష్మి(40), ఆమె స్నేహితుడు ఆటో డ్రైవర్ కాశీనాథ్(52) కిచెన్‌లోకి వెళ్లారు. ఆ సమయంలో మార్క్ సంగీత గొంతు నొక్కడాన్ని గమనించిన ముగ్గురు మార్క్ గొంతు నొక్కి హత్య చేశారు. మృతదేహాన్ని ఆటోలో దూలపల్లి సెయింట్ మార్టిన్ కళాశాల వద్ద గల నాలాలో పడేశారు.

గుర్తు తెలియని కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేసును చేధించారని విలేకర్ల సమావేశంలో ఏసీపీ రాములు తెలిపారు. సంగీత, లక్ష్మి, కాశీనాథ్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా చేధించడంలో సఫలమైన సీఐ విజయవర్ధన్‌తో పాటు ఎస్సైలు, సిబ్బందికి రివార్డును ఇవ్వనున్నట్లు ఏసీపీ తెలిపారు.


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రాములు, తదితరులు

## ఆర్చరీ విజేత చికితరావు


చికిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఆర్చరీ సంఘం నిర్వహించిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ విభాగంలో చికితరావు విజేతగా నిలిచింది. కొల్లూర్ డీపీఎస్‌లో జరిగిన ఈ పోటీల్లో చికిత 690 పాయింట్లతో అగ్రస్థానం సొంతం చేసుకోగా, మానస 683 పాయింట్లతో రజతం, మన్సురాహ్ కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో శివసాయి, సాయి సుశాంత్, రాజేందర్ తొలి మూడు స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ పోటీల్లో పతకాలు నెగ్గిన క్రీడాకారులు తెలంగాణ తరఫున జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు.

## కామన్వెల్త్ కరాటేలో హైదరాబాదీల సత్తా


పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో ముగ్గురు హైదరాబాదీలు పతకాలు కొల్లగొట్టారు. రామినేని రోహన్ (63 కిలోలు) క్యాడెట్ విభాగంలో స్వర్ణం, అగ్రమాది విశాల్ రెడ్డి (57 కి.) క్యాడెట్ విభాగంలో కాంస్యం, తాళపత్రి ఆరాధ్య (42 కి.) కుమిటేలో స్వర్ణ పతకాలు సాధించారు. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, కోచ్ నరేష్ ముదావత్ ఈ ముగ్గురు క్రీడాకారులను అభినందించారు.

## టీటీ చాంప్ తరుణ్


ట్రోఫీలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ లీగ్ చాంపియన్‌షిప్‌లో బాలుర అండర్-19 విభాగంలో కె.తరుణ్ టైటిల్ సాధించాడు. సికింద్రాబాద్‌లోని గుజరాతి సేవా మండల్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగం ఫైనల్లో కె.తరుణ్ 3-2తో రిషబ్ సింగ్‌పై గెలిచాడు. బాలికల కేటగిరీ ఫైనల్లో పాలక్ గాయ్ 3-1తో శ్రీశాన్విపై నెగ్గింది. రాష్ట్ర టీటీ సంఘం మెంటర్ ప్రకాష్‌రాజ్, ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చి అందించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 72 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొన్నారు.

## ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లకు అవకాశం

దుండిగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం డిసెంబరు 11 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

నిజాంపేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీ శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో అరుణ్ గురుస్వామి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప పాటలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. శ్రీనివాస్‌రెడ్డి గురుస్వామి సతీమణి కార్పొరేటర్ కొలన్ తేజశ్రీ, కుమారులు తరుణ్‌రెడ్డి, రిత్విక్‌రెడ్డిలు, భక్తులు పడిపూజలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.


ఎక్స్‌కవేటర్‌తో మట్టి కుప్పను తీయిస్తున్న కమిషనర్ కమిషనర్ శ్రీహరి

## కొంపల్లిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి మున్సిపల్‌లో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రహదారులపై ఉన్న మట్టికుప్పలను ఎక్స్‌కవేటర్, పారిశుధ్య కార్మికులతో తొలగించినట్లు కమిషనర్ శ్రీహరి తెలిపారు. నేడు చెత్త ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రదేశాల్లో ముగ్గులువేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలు డిసెంబరు 1 నుంచి 9 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.


జీఎంకు సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

## ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని జల మండలి జీఎం అశోక్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లకు చెందిన కాలనీల ప్రజలు తాగునీటి సరఫరా సరిగాలేదని, కాలనీలో నూతనంగా మురుగునీటి పైప్‌లైన్లు వేయాలని జీఎంకు వినతి పత్రాన్ని అందజేసి వివరించారు. అనంతరం జలమండలి డీజీఎంలు మేనేజర్లతో జీఎం సమావేశం నిర్వహించి, చర్చించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

## ఆటో కార్మికుల పోస్టర్ ఆవిష్కరణ

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న ఒక రోజు బంద్ కార్యక్రమం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐడీపీఎల్ క్రాంతి ఆటో యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఆటో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఎంతోమంది ఆటో కార్మికులం నష్టపోతున్నామని, సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. దీనికి తోడు నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వద్దకు జరిగే ప్రదర్శన, బహిరంగ సభలో పెద్ద ఎత్తున ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, హరినాథరావు, క్రాంతి, రాజ్‌కుమార్, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెమ్మి నాగమణి దేవేందర్

## స్టడీ సెంటర్‌కు స్థలం కేటాయించాలని వినతి

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఎడ్యుకేషనల్ స్టడీ సర్కిల్‌కు లైబ్రరీ, ఆడిటోరియం కోసం కొంపల్లి మున్సిపాలిటీలోని అపర్ణ ఫామ్ గ్రోలో 500 గజాల స్థలాన్ని కేటాయించాలని మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్, సన్న శ్రీనివాస్, రాంప్రసాద్‌లు సోమవారం కోరారు. ఈ సందర్భంగా వారు మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కొంపల్లి మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతంలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మున్సిపాలిటీలో స్థలాన్ని కేటాయిస్తే వారి భవిష్యత్‌కు బాగుంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఘనంగా కార్తీకమాస చివరిరోజు పూజలు

షాపూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఉమామహేశ్వరాలయంలో, బాపూనగర్ శివాలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఉమామహేశ్వరాలయంలో జరిగిన ఉత్సవాలకు హంపీ పీఠాధిపతి, విద్యారత్న భారత స్వామిజీ, రేరా చైర్మన్ సత్యనారాయణ, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొని పూజలు నిర్వహించారు.


ఉమామహేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో హంపి పీఠాధిపతి


అపురూపకాలనీలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


బాపునగర్‌లో దీపాలను వెలిగిస్తున్న మహిళ